

యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దు

బయ్యారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : యూరియా కృతిమ కొరత సృష్టిస్తే చర్యలుతప్పవని మహబూబాబాద్ డివిజన్ వ్యవసాయ సంచాలకుడు (ఏడీఏ) శ్రీనివాస్ ఎరువుల దుకాణాల యజమానులను హెచ్చరించారు. బుధవారం మండలంలోని లక్ష్మీ గణేష్, రైతుమిత్ర, మదీనా ట్రేడర్స్, శ్రీదివ్య ట్రేడర్స్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ బోర్డు, బిల్‌బుక్స్ పరిశీలించారు. ఏవో రాంజీనాయక్, మహబూబాబాద్ టెక్నికల్ ఏవో రాజు, ఏఈవోలు నాగరాజు, ఫయాజ్ పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలల్లో 28 వరకు

స్పాట్ ప్రవేశాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలు, కొత్తగా ఏర్పడిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ చేసేందుకు ఈనెల 28 వరకు స్పాట్ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు మానుకోట ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు స్పాట్‌లో ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్ https.//iti.telangana.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. అర్హులైన, ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 28వరకు ప్రతీ రోజు ఉదయం 9గంటల నుంచి 11వరకు ఉంటుందని తెలిపారు. 1 ఆగస్టు, 2025 వరకు విద్యార్థులకు 14 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు సంబంధిత అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సీట్ల భర్తీ ప్రక్రియ మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించబడునని తెలిపారు. మొదటి, రెండో దఫాలలో దరఖాస్తు చేసుకొని ప్రవేశం పొందని అభ్యర్థులందరు నేరుగా ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో ప్రవేశానికి హాజరుకావచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సెల్‌ఫోన్ నెంబర్లు తప్పకుండా రాయాలని, ఆధార్ నెంబర్లు రాయాలని సూచించారు. జిల్లాలో అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 77319 71811ను సంప్రదించాలన్నారు.

11న జాతీయ అప్రెంటిస్ మేళా...

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 11న జాతీయ అప్రెంటిస్ మేళాఉంటుందని ప్రిన్సిపాల్ బాబు తెలిపారు. ఈ మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఉత్తీర్ణులైన అభ్యర్థినీ, అభ్యర్థులందరు ఈ అప్రెంటిస్ మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు అప్రెంటిస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోని, ఆధార్, పాస్‌ఫొటోలు, ఐటీఐ మెమో, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను ఈనెల 11న సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అర్హతగల అభ్యర్థులందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



వనితలకు వడ్డీ వాపస్

జిల్లాలో రూ.34.07 కోట్ల మిత్తి డబ్బులు రీఫండ్

- పదేళ్లుగా రాని నిధులు.. ఏడాదిలో విడుదల
- వడ్డీలేని రుణంతో ఆర్థిక స్వావలంబన దిశగా 'ఎస్‌హెచ్‌జీ'లు
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు

కేసముద్రం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా ఎదురు చూసి.. ఇక రావనుకుని.. ఆశలు వదిలేసుకున్న మహిళలకు రుణం వడ్డీ డబ్బులు ఊహించని విధంగా తమ ఖాతాల్లో జమ అవుతున్నాయి. మూడేళ్ల క్రితం నుంచి బ్యాంకు లింకేజి ద్వారా తీసుకున్న రుణాలకు 'వడ్డీ లేని రుణం' (వీఎల్ఆర్) పథకం కింద మహిళలు చెల్లించిన వడ్డీ డబ్బులు ప్రభుత్వం తిరిగి వారికే అందజేస్తోంది. మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాల్లో 15,423స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) ఉన్నాయి. వీటిలో బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొందిన సంఘాలకు ఇప్పటి వరకు రూ.34.07 కోట్ల వడ్డీ తిరిగి ప్రభుత్వం నుంచి పొందారు. జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి 2024-25 వరకు మూడు దఫాలుగా 32,447 సంఘాలు ఈ పథకానికి అర్హత పొందగా వీరికి రూ.34.07 కోట్ల వడ్డీ వాపస్‌గా వచ్చింది.

నియోజకవర్గాల వారీగా చెల్లింపులు ఇలా..

మహబూబాబాద్ నియోజకవర్గంలోని మహబూబాబాద్, కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, గూడూరు మండలాల్లో మూడు దఫాలుగా 10,625 సంఘాలు అర్హతపొందగా రూ.11.58కోట్ల వడ్డీని ప్రభుత్వం మహిళలకు తిరిగి ఇచ్చింది. డోర్నకల్ నియోజకవర్గంలో ఏడు మండలాల్లో 11,620 సంఘాలకు రూ.12.68కోట్లు, ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని బయ్యారం, గార్ల మండలాల్లో 4,140సంఘాలకు రూ.3.94 కోట్లు, ములుగు నియోజకవర్గంలోని

(మిగతా 8లో..)

మండలాల వారీగా స్వయం సహాయక సంఘాల సంఖ్య

మండలం	ఎస్‌హెచ్‌జీ
బయ్యారం	1178
చిన్నగూడూరు	346
దంతాలపల్లి	759
డోర్నకల్	934
గంగారం	260
గార్ల	901
గూడూరు	1493
కేసముద్రం	1627
కొత్తగూడ	659
కురవి	1514
మహబూబాబాద్	945
మరిపెడ	1161
నర్సింహులపేట	688
నెల్లికుదురు	1185
పెద్దవంగర	678
తొర్రూరు	1095
మొత్తం	15,423



మహిళలకు ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

నర్సింగోజు ప్రభురాణి, స్వయం సహాయక సంఘం సభ్యురాలు, కేసముద్రం స్టేషన్

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తోందనడానికి పదేళ్ల తర్వాత వడ్డీ డబ్బులు తిరిగి ఇవ్వడమే ప్రత్యక్ష నిదర్శనం. అంతేకాకుండా మహాలక్ష్మి పథకం కింది ఉచిత బస్సు, రూ.500లకు గ్యాస్ సిలెండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరా మహిళ శక్తి కింద స్వయం సహాయ సంఘాలకు ఆర్థిక స్వావలంబన, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. పదేళ్ల తర్వాత ఊహించని విధంగా వడ్డీ తిరిగి రావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మానుకోటలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, అధికారులు

సార్‌కు ఘన నివాళి

- ఊరూరా జయశంకర్ జయంతి
- విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులు
- తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలను కొనియాడిన వక్తలు

8

జీవనోపాధి దెబ్బతినకుండా చూడాలి

- సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అనేక ఏళ్లుగా చిరు వ్యాపారులు గుమ్మిలు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని వారి జీవనోపాధి దెబ్బతినకుండా చూడాలని సీపీఐ మునిసిపల్ మాజీఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ బంధం చెరువు వద్ద గుమ్మిదారులకు మునిసిపాలిటీ అధికారులు నోటీసులిచ్చిన నేపథ్యంలో స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం గుమ్మిదారులు ఆందోళన చేపట్టారు. అనంతరం కమిషనర్ రాజేశ్వర్, స్థల యాజమానులతో కలిసి బంధం చెరువు వద్ద పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుమ్మిదారులకు జీవనోపాధి పోకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపించాలని కోరారు. వారి గుమ్మిలను తొలగిస్తే గమ్మిదారుల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థల యజమానులు ముత్యం వెంకన్న, నాయిని రంజిత్, రాంచంద్రారెడ్డి, ఆవుల వెంకన్న, మహబూబ్‌పాషా, సీపీఐ నాయకులు పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, రమేష్, గుమ్మిదారులు వీరన్న, బిచ్చు, కోటి, సర్వేష్, సుమన్, సురేష్, గోపాల్, కవిత, యూసుబ్, భద్రయ్య, పాషా, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ముస్లింల రిజర్వేషన్ కోసమే కాంగ్రెస్ ధర్నా

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వల్లభు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ముస్లింల రిజర్వేషన్ కోసమే కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేపట్టారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గంలో బీసీలకు ఎన్ని మంత్రి పదవులు కట్టబెట్టారో.. చెప్పాలని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్‌కు బీజేపీ పార్టీ వ్యతిరేకం కాదని, ముస్లింలకు 10 శాతం ఇచ్చే రిజర్వేషన్‌కు మాత్రమే వ్యతిరేకమన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన రిజర్వేషన్ ముమ్మాటికి ముస్లింల రిజర్వేషన్‌నే అన్నారు. ఈ సమావేశంలో చీకటి మహేష్‌గౌడ్, సింగారపు సతీష్, గడ్డం అశోక్, ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్, రవి పాల్గొన్నారు.

చారిత్రక ఆలయాలను అభివృద్ధి చేయాలి

- ఇందుకోసం ఉమ్మడి జిల్లాకు రూ.185కోట్లు ఇవ్వాలి
- ఎంపీ కావ్యతో పాటు ఎమ్మెల్యేల విజ్ఞప్తి
- కేంద్ర పర్యాటక శాఖ మంత్రికి వినతి పత్రం
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి
- 'ప్రసాద్' పథకం కింద పునరుద్ధరణకు హామీ



కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ డాక్టర్ కావ్యతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రక ఆలయాలు, కాకతీయ వారసత్వ సంపదను పునరుద్ధరించాలని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్యే బస్వరాజు సారయ్యతో కలిసి వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను అభ్యర్థించారు. బుధవారం వీరు ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని పలు ఆలయాల అభివృద్ధిపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. చారిత్రకంగా ఎంతో సుప్రసిద్ధమైన ఈ ఆలయాల అభివృద్ధికి రూ.185కోట్లను ఇవ్వాలని కోరారు. తెలంగాణ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలంటే ఆలయాల పునరుద్ధరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి వివరించారు. హనుమకొండ వేయిస్తంభాల గుడి కల్యాణ మండపంలో మిగిలిపోయిన మరమ్మతు పనులు, విగ్రహ ప్రతిష్ఠాపన, పార్కింగ్, శౌచాలయాల కోసం రూ.75కోట్లు, భద్రకాళి ఆలయంలోని మహామండప పునర్నిర్మాణం, పర్యాటక సదుపాయాల కోసం రూ.100కోట్లు, చిల్పూర్‌లోని శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయం(తెలంగాణ తిరుపతి)లో భక్తుల వసతికి గదులు, కొండపైకి రవాణామార్గం కోసం రూ.9.97కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నపాక ఆలయం, కోటగుళ్లు, రెడ్డిగుడి ప్రత్యేక శిలపై నిర్మితమైన ఆలయాల పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని కోరారు. అలాగే వరంగల్ కోటలో ఉన్న 14ఆలయాల పునరుద్ధరణ పనులకు

(మిగతా 8లో..)

'ఆన్‌లైన్' పనులను పూర్తి చేయాలి

- పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజీవ్



మహబూబాబాద్‌లోని మోడల్ స్కూల్‌లో మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను పరిశీలిస్తున్న రాజీవ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖ పాఠశాలల బలోపేతం, పారదర్శకత కోసం ప్రవేశ పెడుతున్న 'ఆన్‌లైన్' పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లాలోని ప్రభుత్వ, కేజీబీవీ, మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేకాధికారులు, ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల యూ-డైస్, ఆధార్ అప్‌డేషన్, అపార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్, డ్రాప్ బాక్స్‌ల వివరాలను మండలం, పాఠశాలల వారీగా రివ్యూ చేశారు. అనంతరం రాజీవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ప్రతీ విద్యార్థి తరగతుల వారీగా కనీస సామర్థ్యాలు సాధించేలా బోధన చేయాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఏఎంవో జావిద్, డీఈవో రవీందర్‌రెడ్డి, ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ పూర్ణచందర్, ఏసీజీఈ మందుల శ్రీరాములు, డీఎస్వో అప్పారావు, జీసీడీవో విజయకుమారి, ఏపీవో నదీమ్, ఎంఈవోలు పాల్గొన్నారు.

టింకరింగ్ ల్యాబ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలకు అందించిన టింకరింగ్ ల్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని రాజీవ్ అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, మోడల్ స్కూల్, మరిపెడ మండలంలోని సీతారాంపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాలలకు అందజేసిన టింకరింగ్ ల్యాబ్స్, ఏఆర్‌అండ్‌వీఆర్ ల్యాబ్స్, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, బ్యాండ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర, సాంకేతిక రంగాలు, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రవేశపెడుతున్న ప్రతీ పథకాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ఏఎంవో జావిద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎస్వో అప్పారావు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపేందర్‌రావు, రామచంద్రుడు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- మలేరియా అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్‌నాయక్



జిల్లా ప్రధాన ఆస్పత్రిలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అమర్‌సింగ్ నాయక్

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వర్షకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మలేరియా అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్‌నాయక్ అన్నారు. డీఎంహెచ్‌వో రవిరాథోడ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంవోలు జగదీశ్వర్, హర్షవర్ధన్‌తో కలిసి మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో బుధవారం ఆకస్మీకంగా సందర్శించారు. టి హబ్ డయాగ్నస్టిక్ సెంటర్, బ్లడ్‌బ్యాంక్ స్టోరేజి, మలేరియా ల్యాబ్‌లతో పాటు సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వర్షకాలంలో సీజనల్‌గా వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యం కోసం వచ్చే రోగులకు వైద్యసేవలతో పాటు మందులను అందజేయాలన్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు చుట్టూఉండే ప్రదేశాలను శుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మాస్ అడ్మినిస్ట్రేషన్ (ఫైలేరియా)లో ఎంపిక చేసిన బయ్యారం, గంధంపల్లి, ముల్కనూరు, కొత్తగూడ, కోమట్లగూడెం, గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈనెల 10 నుంచి 25 వరకు మాస్ అడ్మినిస్ట్రేషన్‌పై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంవోలు జగదీశ్వర్, హర్షవర్ధన్, డిప్యూటీ డీంఎంఅండ్‌హెచ్‌వో సుధీర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


అశోక్ (ఫైల్)

గూడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపేట జాతీయ రహదారి 365పై బుధవారం ఉదయం కారు, లారీ ఢీకొని ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన ప్రకారం. భూపతిపేట సమీపంలో నర్సంపేట పట్టణానికి చెందిన బూర అశోక్‌కుమార్ (54) కారులో గూడూరు నుంచి నర్సంపేటకు వెళ్తున్నాడు. భూపతిపేట వద్దకు చేరుకోగానే నర్సంపేట నుంచి గూడూరు వైపు వస్తున్న లారీ ఎదురెదురుగా అతివేగంగా కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న అశోక్‌కుమార్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గూడూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో కారులో ఇరుక్కుపోయి మృతి చెందిన అశోక్ కుమార్ బయటకు తీయించారు. అనంతరం మృతుడి భార్య స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖమ్మం రూరల్‌కు చెందిన లారీ డ్రైవర్ ఏపూరి తిరుపతి రావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టెస్కో వస్త్రాలపై డిస్కౌంట్

జనగామ రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా టెస్కో వస్త్రాలపై ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నట్లు వరంగల్ డివిజనల్ మార్కెటింగ్ అధికారి బొట్టు వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అన్ని రకాల వస్త్రాలపై 30 శాతం, రాజ్‌కోట్ ఇక్కత్ సిల్క్ చీరలపై 40 శాతం, ఎంపిక చేసిన వస్త్రాలపై 50 శాతం ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మునిసిపల్ కార్యాలయంలో టెస్కో స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెస్కో చేనేత వస్త్రాలను ధరించి కాలుష్యం పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు.

గంజాయి ముఠా అరెస్ట్

1.300 కిలోల గంజాయి స్వాధీనం

పాలకుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గంజాయిని గుట్టుగా సరఫరా చేస్తున్న ముఠాను బుధవారం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ జానకిరాంరెడ్డి తెలిపిన వివరాల మేరకు .. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ శబరీనాథ్, సముద్రాల గ్రామానికి చెందిన గుండె నవీన్, పాలకుర్తి మండలం గూడూరు గ్రామానికి చెందిన గుగ్గిల్ల ప్రవీణ్, గుండ్ల సంపత్, లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన బండారి అఖిల్ ముఠాగా ఏర్పడి తక్కువ ధరకు గంజాయి తీసుకువచ్చి గ్రామాల్లో విక్రయిస్తున్నారు. కొద్దిరోజులుగా పాలకుర్తి శివారులోని కూషిగుట్ట సమీపంలో విద్యార్థులు, యువకులకు గంజాయిని సరఫరా చేస్తున్నారు. పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి వద్ద 1.300 కిలోల గంజాయి, బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి ముఠాను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై పవన్‌కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు. మాదక ద్రవ్యాలకు బానిసై నిండు జీవితాన్ని కోల్పోవద్దని సీఐ సూచించారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్‌ఘన్‌పూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గంజాయి తీసుకెళ్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. సీఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఇంతియాజ్ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి గంజాయి కవర్‌ను అక్కడే వదిలేసి పరుగెత్తాడు. పోలీసులు నిందితుడిని పట్టుకొని విచారణ చేశారు. తాను వారం క్రితం విశాఖపట్టణానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర కొన్నట్లు ఇంతియాజ్ తెలిపాడు. అతడి వద్ద 430 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

10న జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయి సీనియర్స్ మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో నిర్వహించనున్న ఎంపికపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 23, 24 తేదీల్లో కుమరంభీం జిల్లా కేంద్రంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. ఆసక్తి, అర్హత కలి గిన క్రీడాకారులు ఈనెల 10న ఉదయం 9గంటలకు జేఎన్ఎస్‌లోని బాల్‌బ్యాడ్మింటన్ కోర్టులో రిపోర్టు చేయాలని వీరన్న ప్రకటలో పేర్కొన్నారు. వివరాలకు 9849201467 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

జర భద్రం

- పొంచిఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- పొంగుతున్న మురుగు కాలువలు
- పట్టించుకోని అధికారులు


పట్టణంలోని 2వవార్డు పరిధిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


సమత కళాశాల ఎదుట గుంత తీసి వదిలేసిన దృశ్యం

తొర్రూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల కాలం ప్రారంభమైంది. రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వర్షపు నీరు రోడ్లపైన నిలుస్తున్నాయి. నీరు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో దోమలు ప్రబలి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది.

దోమల నివారణతోనే..

దోమలను నివారించగలిగితే సగం రోగాలు దరి చేరవు. దోమ కాటు వల్ల మలేరియా, విష జ్వరం, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు సోకుతాయి. ప్రధానంగా తొర్రూరు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. రోడ్ల వెంట కాల్వలపై పొంగుతున్న మురుగునీరు, చెత్తా చెదారాలను తొలగించకపోవడంతో దుర్వాసన వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో భగీరథ తాగునీటి పైప్‌లైన్లు లీకేజీల ద్వారా నీటి వృథాతో పాటు నిల్వ వల్ల మురుగు పెరిగి ప్రజలు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు, అన్నారం రోడ్డు, కాకతీయ నగర్, బీరప్ప నగర్, సాయి నగర్, ఎస్‌వీఎన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్లపై మురుగు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అమృత్ పైప్‌లైన్లు

పట్టణంలో ఇప్పటికే డ్రెయినేజీలు లేకపోవడం, ఉన్న డ్రెయినేజీల పక్కన అమృత్ పైప్‌లైన్లు కోసం కాలువలు తవ్వి పైపులు వేసి పూడ్చకుండా వదిలేయడంతో తీవ్ర ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత సూపర్‌వైజర్‌కు తెలిపినా పట్టించుకోవడం లేదు. అమృత్ పనులు కోట్ల రూపాయల్లో నడుస్తుండడంతో సంబంధిత శాఖ అధికారులు ఈఈ నుంచి ఏఈ వరకు మామూళ్ల మత్తులో మునిగిపోయి ప్రజా సమస్యలు పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మునిసిపల్ కమిషనర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలి. మురుగు, వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలి. ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన పెంచేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. - డాక్టర్ జ్వలిత, వైద్యాధికారి

పారిశుధ్య పనులు చేపట్టాలి

పట్టణంలోని అన్ని వార్డుల్లో భగీరథ పైప్‌లైన్ లీకేజీ ద్వారా రోడ్లన్నీ మురుగు నీటితో నిండిపోతున్నాయి. ప్రతిరోజూ కాలనీల్లో చెత్త తొలగించకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. మునిసిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోవాలి. కాలువలను మరమ్మతు చేసి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. - పైండ్ల రాజేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు, తొర్రూరు

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న ప్రవాహం

మహాదేవపూర్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 90,330 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా గేట్లన్నీ ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం 2.10 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది.

'దేవాదుల'లో మూడు మోటార్లు ఆన్

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం పంచాయతీ పరిధిలోని గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తి పోతల ప్రాజెక్టు ఫేజ్-3లో బుధవారం నాలుగు మోటార్లను ఆన్ చేశారు. ఇప్పటికే ఫేజ్ 1,2,3 ద్వారా నీటిని అధికారులు పంపింగ్ చేస్తున్నారు. ఫేజ్-3లో మోటార్లను ఆఫ్ చేసి ఫేజ్- 1లో రెండు, ఫేజ్-2లో రెండు మోటార్ల ద్వారా మంగళవారం వరకు నీటిని పంపింగ్ చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని ఫేజ్-1లో రెండు మోటార్లు, ఫేజ్-2లో రెండు మోటార్లు, ఫేజ్-3లో నాలుగు మోటార్లు.. ఇలా మొత్తం ఎనిమిది మోటార్ల ద్వారా 2,014 క్యూసెక్కుల నీటిని జయశంకర్ భూపాలపల్లి జిల్లా భీంఘనపూర్ రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్వెల్ వద్ద 74.80 మీటర్ల నీటి మట్టం నమోదైంది.

సమ్మక్కసాగర్ బ్యారేజీ 10 గేట్లు మూసివేత

తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలో 10 గేట్లను బుధవారం మూసి వేశారు. గత కొన్ని రోజుల నుంచి మంగళవారం వరకు బ్యారేజీని ఫ్రీ ఫ్లోగా ఉంచిన అధికారులు బుధవారం 10 గేట్లు కిందకు దించి మూసి వేశారు. కొన్ని రోజులుగా వర్షాలు లేకుండా ఎండలు కాస్తుండటంతో ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో దేవాదుల నుంచి మోటార్లను పంపింగ్ చేసేందుకు వీలుగా బ్యారేజీ గేట్లను మూసివేశారు. బ్యారేజీలోకి ఎగువ నుంచి 1,21,060 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 10 గేట్ల ద్వారా 1,19,337 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 6.94 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.188 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. బ్యారేజీ వద్ద 74.35 మీటర్ల నీటిమట్టం నమోదైంది.


పైపులైన్ లీకై బురదమయమైన దృశ్యం

పైపులైన్ లీకేజీ

కురవి, ఆగస్టు 6 (ఆంధజ్యోతి): మండలంలోని బంచరాయితండ జీపీ పరిధిలో పైపులైన్ లీకైంది. అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగు నీటితో కలుషితమవుతుందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బొడ్రాయిగల్లీలో రోడ్డుపక్కన పైపులైన్ లీకై మట్టిలో కూరుకుపోయింది. పైపుల నుంచి నీరు బయటకు వచ్చి బురదమయంగా మారుతోంది. దీంతో గ్రామస్థులు వ్యాధుల బారిన పడుతున్నారు. కార్యదర్శికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పైపులైన్లకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కేటీపీపీ రెండో దశ విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్

గణపురం, ఆగస్టు 6(ఆంధ్రజోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు రెండో దశ విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్ పడింది. బాయిలర్ ట్యూబ్‌లో లీకేజీ సమస్య తలెత్తడంతో మంగళవారం రాత్రి ప్రాజెక్టును షట్‌డౌన్ చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అంతేకాకుండా బుధవారం లీకేజీని సవరించి విద్యుత్ పునరుత్పత్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఐటీడీఏ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా

- 77 మందికి ఉద్యోగావకాశాలు


జాబ్ మేళా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా

ఏటూరునాగారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఆధ్వర్యంలో బుధవారం ఏటూరునాగారంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రమిశ్రా ఆదేశాల మేరకు గిరిజన యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ జాబ్ మేళాకు మొత్తం 18 ప్రైవేట్ కంపెనీలు హాజరయ్యాయి. ములుగు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి మొత్తం 378 మంది గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూల అనంతరం వివిధ కంపెనీలకు 77 మంది అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపికయ్యారు. వారికి పీవో చిత్రమిశ్రా చేతుల మీదుగా నియామక పత్రాలకు అందజేశారు.

టీమ్ హెచ్‌ఆర్ కంపెనీలో 12 మంది, సీ2సీలో నలుగురు, గురు, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్‌లో 10 మంది, ఆదర్శ మోటార్స్‌లో 10, మిజమో మీడియాలో ఐదుగురు, క్యాపిటర్ వింగ్‌లో ఏడుగురు, యూనిమల్ హెచ్‌ఆర్ సొల్యూషన్‌లో 15 మంది, విజయ బయో ఫెర్టిలైజర్స్‌లో 10 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జె. వసంతరావు, డిప్యూటీ డైరెక్టర్ పోచం, ఏవో రాజ్‌కుమార్, పెసా మొబిలైజర్ కొముర్రం ప్రభాకర్, మేనేజర్ శ్రీనివాస్, జేడీఎం కొండలరావుతోపాటు ఐటీడీఏ సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతిపై సమీక్ష

మల్హర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : భూ భారతిపై మండల కేంద్రమైన తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో భూపాలపల్లి అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వీలైనంత త్వరలో భూ భారతి ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కా టారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ రవికుమార్, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

- మహముత్తారం (ఆంధ్రజ్యోతి): భూభారతి సమస్యలు వెనువెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌తో కలిసి పరిశీలించారు భూభారతి దరఖాస్తులను పరిశీలించారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్ చేయాలన్నారు. చట్టపరంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలనలో రైతులకు పెద్దపీట

కాటారం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో రైతుల సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని ఆ పార్టీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అమలు చేయని పలు పథకాలను ప్రస్తుత ప్రభుత్వం చేస్తోందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 50శాతం రాయితీపై రైతులకు పనిముట్లు అ ందించడం సంతోషకరమన్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చీటూరి మహేష్ గౌడ్, నాయకులు మేడిపల్లి కిరణ్, బానోత్ రాజు నాయక్, సంపత్‌రెడ్డి, శ్రావణ్, బషీర్‌ఖాన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్‌కు మాతృ వియోగం

మల్హర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి తల్లి లక్ష్మీబాయి మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. రిజర్వేషన్ బిల్లుపై దేశరాజధాని ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలో పాల్గొనేందుకు వెళ్లిన ప్రకాశ్‌రెడ్డి విషయం తెలుసుకొని హుటాహుటిన తిరిగి వచ్చారు. స్వగ్రామమైన భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం వల్లెంకుంటలో లక్ష్మీబాయి అంత్యక్రియలు జరిగాయి. కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఫైలేరియా వ్యాధులను అరికట్టాలి

- మలేరియా అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్


బయ్యారంలో ఫైలేరియాపై సమీక్షిస్తున్న అమర్‌సింగ్‌నాయక్

బయ్యారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఏజన్సీ ప్రాంతాల్లో ప్రబలే ఫైలేరియా వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని మలేరియా అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 6 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు బయ్యారం, గంధంపల్లి, కొత్తగూడ, మల్యానూర్, కోమట్లగూడెం, గంగారం పరిధిలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఫైలేరియా) ప్రోగ్రాంకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భం గా అమర్ సింగ్‌నాయక్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. వర్షాకాలంలో వచ్చే రోగాల నివారణకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆరోగ్యశాఖ చేపడుతున్న చర్యలకు పూర్తిగా సహకరించాలన్నారు. ముఖ్యంగా పల్లెవాసులలో ఆరోగ్య అవగాహన పెంచేందుకు ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10 నుంచి 25 వరకు జిల్లాలోని పైన పేర్కొనబడిన 6 ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాల పరిధిలో మాస్ అడ్మినిస్ట్రేషన్ (ఫైలేరియా) కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్, గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ శ్రీనివాస్, ఆర్ఎంవో హర్ష వర్ధన్, జగదీశ్వర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్ రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డబ్లూహెచ్‌వో కన్సల్టెంట్ సైదులు, హెల్త్ ఎడ్యుకేటర్ రాజు, పురుషోత్తం, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణతో పాటు పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయ్, ఉస్మాన్, శివకుమార్, రాజ్‌కుమార్, మురళి, సాయినాథ్‌తో పాటు వైద్య సిబ్బంది. కాగా, జిల్లా డీసీహెచ్ఎస్ చింత రమేష్ మలేరియా అడిషనల్ డైరెక్టర్ అమర్ సింగ్ నాయక్‌ను ఈ సందర్భంగా సన్మానించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ఇల్లు కాలిపోవడంతో ఆరుబయట రోదిస్తున్న బాధితురాలు రాజేశ్వరి

కృష్ణకాలనీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో ఇల్లు దగ్ధమైన సంఘటన భూపాలపల్లి మండలంలోని నాగారం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బెల్లం గొండ రాజేశ్వరి-రమేష్ దంపతులు ఇదే గ్రామంలో వ్యవసాయ కూలిగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తడకలతో ఏర్పాటు చేసుకున్న ఇంట్లో నివసిస్తుండగా బుధవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చుట్టూరా, పైకప్పు తడకలు, ఎండిన పొరక కావడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోని వస్తువులు, దుస్తులు, నిత్యావసర సరుకులు, రూ. 50వేల నగదు పూర్తిగా కాలి బూడిద అయ్యాయని బాధితులు తెలిపారు. మంటలు సంభవించడంతో గ్రామస్తులు నీళ్ల చల్లి ఆర్పివేయగా అప్పటికే వస్తువులన్నీ కాలిపోయాయి. దీంతో ఆ కుటుంబం నిలువనీడ లేక రోడ్డున పడింది. అగ్ని ప్రమాదంతో సుమారు రూ. 2లక్షల మేర నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత దంపతులు వేడుకుంటున్నారు.

1200 మంది ఓటర్లు దాటితే

మరో బూత్ ఏర్పాటు

- ఆర్డీవో వెంకన్న ● రాజకీయ నాయకులతో సమావేశం


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్‌లలో 1200 మంది ఓటర్లు దాటితే మరో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేస్తామని ఆర్డీవో వెంకన్న తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ఓటరు జాబితా నవీకరణ, మార్పుల అంశాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో పలు సూచనలు చేశారు. ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులు ఉంటే సిబ్బంది ఇంటి వద్దకు వచ్చినప్పుడు పూర్తి ఆధారాలతో సర్వే సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ప్రతీ బూత్ స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల తరఫున ఒక బూత్ లెవల్ ఏజెంట్‌ను పార్టీల నాయకులు ఏర్పాటు చేసి సంబంధిత వివరాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సిబ్బంది శ్రీప్రియ, మహిపాల్‌రెడ్డి, నాయకులు తెల్లాకుల రామకృష్ణ, మారపల్లి ప్రసాద్, కొలనుపాక శరత్‌కుమార్, తోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2151	1521
పల్లికాయ (సూక)	6100	3450
పల్లికాయ (పచ్చిది)	5000	1575
కందులు	5818	3022
పెసళ్లు	7022	3022
పత్తి	7720	5300
పసుపు (కాడి)	11759	9534
పసుపు (గోల)	10600	8700
తేజ మిర్చి	11300	8500
తేజ ఏసీ	13500	11500
వండర్‌హాట్	12000	6000
వండర్‌హాట్ ఏసీ	15500	11500
యూఎస్341ఏసీ	13700	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	5000	3000

- వరంగల్ వ్యవసాయం

ఫొటో జర్నలిస్టులకు పోటీలు

వడ్డెపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్టాఫ్ ఫొటో జర్నలిస్టులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు వేముల నాగరాజు తెలిపారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీల్లో పాల్గొనే ఫొటోగ్రాఫర్లు ఈనెల 7 నుంచి 11 వరకు ఫొటోలు పంపించాలని కోరారు. బెస్ట్ న్యూస్ పిక్చర్, ఫీచర్, కల్చరల్ విభాగాలలో 8/12 సైజులలో ఫొటోలను పోటీల కోసం ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు, తృతీయ బహుమతి రూ.3వేలతో పాటు షీల్డ్, సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కన్సోలేషన్ బహుమతి కింద రూ.వెయ్యి నగదుతోపాటు షీల్డ్ అందిస్తామని స్పష్టం చేశారు.

పోటీలలో పాల్గొనే ఫొటో జర్నలిస్టులు ఫొటోలను నేరుగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్లు : 90002 83008 / 99854 10386లలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, ఫొటో జర్నలిస్టులు గోకారపు శ్యామ్, సంపెట సుధాకర్, వీరగోని హరీష్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు బొడిగె శ్రీను, వరప్రసాద్, బూర్ల నరేందర్, విష్ణు వర్ధన్, నయీంపాష తదితరులు పాల్గొన్నారు.



రికవరీ చేసిన సొత్తును చూపిస్తున్న పోలీసులు

చోరీ కేసులో ముగ్గురు మైనర్ల అరెస్టు

ములుగు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓ వైన్స్ షాపులో చోటుచేసుకున్న చోరీ కేసులో ముగ్గురు మైనర్లను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సురేష్ వివరాలు వెల్లడించారు. ఈనెల 3న అర్ధరాత్రి ములుగు జిల్లా కేంద్రంలోని రెడ్డి వైన్స్ షాపులో చోరీ జరిగింది. క్యాంటీన్ గ్రిల్స్‌ను తొలగించి లోపలికి చొరబడి రూ.15 వేల విలువగల సిగరేట్ ప్యాకెట్లు తీసుకొని వైన్స్ షాపులోకి వెళ్లారు. కౌంటర్‌లో ఉన్న రూ 1.60 లక్షల నగదును, రూ. 22,200 విలువ గల మద్యం సీసాలను అపహరించారు.

సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగతనానికి పాల్పడిన ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని విచారించగా నిందితులు నేరాన్ని అంగీకరించారు. చోరి చేసిన సొమ్ము నుంచి రూ. 2 వేల నగదు, రూ. వెయ్యి విలువ గల సిగరెట్ ప్యాకెట్లు, రూ. 2,320 విలువ గల మద్యాన్ని జల్సాలకు వాడుకున్నట్లు సీఐ తెలిపారు. మిగిలిన నగదు, మద్యం బాటిళ్లు, సిగరెట్ ప్యాకెట్లను రికవరీ చేశామన్నారు. నిందితులను జువైనల్ జస్టీస్ బోర్డు ఎదుట హాజరు పర్చినట్లు వెల్లడించారు.

ఆయారే తీజ్!

గిరిజన తండాల్లో సంబరాలకు రెడీ


వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని రామోజీ కుమ్మరి గూడెం తండాలో ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన డాగ్గో (మంచె) పై బుట్టలు

- ఈ నెల 7న పెద్ద ఎత్తున పండుగ
- గిరిజనుల సంప్రదాయ పండుగల్లో తీజ్ ముఖ్యమైనది
- పెండ్లి కాని యువతులకు ఎంతో ప్రాధాన్యత
- దేవతలకు నైవేద్య సమర్పణ, జంతు బలులు
- రాఖీ పండుగకు ముందే నిర్వహించడం ఆనవాయితీ
- తొమ్మిది రోజుల పూజల తర్వాత చెరువులో నిమజ్జనం

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తండాలకు తీజ్ సంబురం రానే వచ్చింది. తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా జరిగే పండుల్లో గిరిజనుల తీజ్ (బతుకమ్మ) పండుగ ఒకటి. లంబాడ గిరిజనుల (బంజారాలు) సంప్రదాయ మొలకల పండుగను రాఖీ పౌర్ణమి పండుగకు ముందుగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పెండ్లి కాని ఆడ బిడ్డల ఆటపాటలు, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలు, భక్తి భావంతో చేసే తొమ్మిది రోజుల మేళవింపే నవ దాడేరి తీజ్ (బతుకమ్మ) పండుగ. శ్రావణ మాసంలో గిరిజనులు తీజ్ వేడుకలను తమ సంస్కృతిని ప్రతిబింబించేలా జరుపుకుంటారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న తండాల్లో దాదాపు తీజ్ ఉత్సవాలకు సిద్ధమవుతున్నారు.

ముగ్గురికి నివేదన..

తీజ్ ఉత్సవాల్లో ముగ్గురికి నివేదన సమర్పించడం గిరిజనులకు సంప్రదాయంగా వస్తోంది. మేర మయాడీ, దండి యాడీ, సేవాభాయి వీరికి వారి సంప్రదాయాల్లో పూజలు చేసి తీజ్ ఉత్సవాలు చేస్తారు. పెండ్లి కాని యువతులు తమకు మంచి వరుడు రావాలని, తండావాసుల పాడి పంటలు, పిల్లా పాపలు చల్లంగా ఉండాలని వేడుకుంటూ తొమ్మిది రోజుల పాటు వీరిని ఆరాదిస్తారు. మేర మయాడీ, దండి యాడీలకు చివరి రోజు జంతు బలి ఇస్తారు. సేవా భాయికి బియ్యం, నెయ్యి, పాలతో నైవేద్యం తయారు చేసి పెడతారు. ఒక గుంతలో సేవాభాయికి సంబంధించిన బుట్టను వేసి నిప్పులతో దూపం వేసి సంప్రదాయ పద్ధతిలో పూజా తంతు నిర్వహిస్తారు.

ఏడుగురు దేవతలు..

లంబాడ తెగ గిరిజనులకు ఏడుగురు స్త్రీ దేవతలు ఉన్నారు. మెరామ, హింగళ, తుల్జా, కేంకాళి, తీజ్, మత్రాళ్, సీత్ల అనే దేవతల పేర్ల మీదుగా నిర్వహించేవి ప్రధాన పండుగలు. మెరామ దేవత తండాను రక్షిస్తే, తీజ్ దేవత పంటలను కాపాడుతుందని నమ్ముతారు. సీత్ల దేవత పశు సంపదను వృద్ధి చేస్తుందని, మత్రాళ్ దేవత పిల్లలు అంటు వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుందని విశ్వసిస్తారు. వివిధ ప్రాంతాల్లో ఉండే బంధువులంతా పండుగల సందర్భంగా కలుసుకుని ఆత్మీయత, అనురాగాలను పంచుకుంటారు. యుక్త వయస్సు ఉన్న గిరిజన యువతులు విద్య, ఉద్యోగ, సంసారిక జీవితం, పుట్టినింటితో పాటు మెట్టినిల్లు కూడా అష్ట ఐశ్వర్యాలు, సుఖ సంతోషాలతో తుల తూగాలంటూ ప్రతి ఏటా మొలకల పండుగ నిర్వహిస్తారు.

పండుగ విశిష్టత..

తీజ్ (బతుకమ్మ) పండుగను గిరిజనులు తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. ఆయా రోజుల్లో యువతులు రొట్టెలు, ఆకుకూరలు మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. బుట్టలు ఎందరు ఉంచినా అందులో ఐదుగురు యువతులు మాత్రమే నిష్టతో పూజ చేస్తారు. చివరి రోజు యువతులు మొలకల బుట్టలను తలపై పెట్టుకుని చెరువు వద్దకు వెళ్తారు. అప్పటికే అక్కడ సంప్రదాయ పద్ధతిలో రుమాలాలు తలకు చుట్టుకొని పెద్ద మనుషులు కూర్చుంటారు. యువతులు బుట్టల్లోని కొన్ని మొలకలను తలపాగాలో వేస్తారు. అనంతరం బుట్టలకు పూజలు చేసి చెరువులో వదులుతారు. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత పెద్ద మనుషుల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకుంటారు. యువతులను కూడా పీటలపై కూర్చోబెట్టి పెద్ద మనుషులు వారి కాళ్లు కడిగి ఆశీర్వదిస్తారు. పుట్టిన ప్రతి గిరిజన యువతికి పెండ్లి జరిగే నాటికి తీజ్ పండుగను ఆ కుటుంబ సభ్యులు నిర్వహించడం ఆనవాయితీ. దీనికి తోడు తీజ్ పండుగకు వచ్చిన ఆడపడుచు రాఖీ పండుగ రోజున తన సోదరుడికి రాఖీ కట్టి తిరిగి వెళ్లిపోవడం అనాధిగా వస్తున్న ఆచారమని చెపుతున్నారు.

రేగి చెట్టుకు పూజలు చేసి..

పెండ్లి కాని యువతులు రేగిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి తీజ్ వేడుకలను ప్రారంభిస్తారు. అంతకు ముందే తండాల్లో పెద్దలు ప్రతి ఇంటి నుంచి గోధుమలు సేకరించి రోజంతా నీళ్లలో నానబెడతారు. పెండ్లి యువతులు చిన్న చిన్న వెదురు బుట్టల్లో పుట్టమన్ను, గోవు పిడకల చూర్ణాన్ని కలిపి నాయక్ (పూజారి) ఇంటికి తీసుకు వస్తే ఆయన భార్య ఆ బుట్టలో నానబెట్టిన గోధుమలు వేసి అలుకుతుంది. అనంతరం పూజలు చేసి బుట్టలను డాగ్గో (మంచె) పై ఉంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక జలాలు చల్లుతూ ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఐదు బుట్టలు ప్రత్యేకం..

తండాలో కొంత మంది కలిసి ఓ ఇంటి వద్ద డాగ్గో (మంచె)ను ఏర్పాటు చేస్తారు. దానిపై ఇంటికో బుట్టలో గోధుమలు వేసి బుట్టలన్నీ మంచెపై ఉంచుతారు. ఇలా తొమ్మిది రోజుల పాటు రోజు నీటిని పోస్తూ మొలకలు వచ్చేలా పెంచుతారు. పదో రోజున వైభవంగా తండా చెరువులో నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్తారు. ఈ బుట్టల్లో ఓ ఐదు బుట్టలు ప్రత్యేకంగా ఉంటాయి. వాటిని ఇంటి బిడ్డలు మాత్రమే దించాలనేది వీరి నమ్మకం. వాటిని దించిన తర్వాతనే మిగతా బుట్టలను సైతం దింపి ఊరేగింపుగా తీసుకెళ్తారు.

ఆడబిడ్డల పండుగే తీజ్..



ఆడబిడ్డలను ఆరాధ్యంగా పూజించడమే తీజ్ పండుగను నిదర్శనం. పెండ్లి కానీ యువతులు మంచి మగడు రావాలని, పాడి పంటలు చల్లంగా ఉండి తండావాసులు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుతూ నమ్ముకుంటాం. నా వయసు 75 సంవత్సరాలు మా తండ్రుల కాలం నుంచి ఈ పండుగను రాఖీ పౌర్ణమికి ముందు నిర్వహిస్తాం. యువతులు పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవాలి. ఆడబిడ్డల కాళ్లు కడిగి ఆ ఇంటిల్లి పాది ఆశీర్వాదం తీసుకోవడమే ముఖ్యమైన ఘట్టం.

\- భూక్యా ద్వాలీ, రామోజీ కుమ్మరిగూడెం తండా

గిరిజనుల ముఖ్యమైన పండుగ..



గిరిజనుల ముఖ్యమైన పండుగల్లో తీజ్ ఒకటి. తీజ్ ఉత్సవాలకు ప్రభుత్వం నిధులు ఇస్తే మరింత ఉత్సాహంగా జరుపుకుంటాం. కరువు కాటకాల నుంచి కాపాడాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని వేడుకుంటాం. ఈ నెల 7న చివరి రోజు ఎంతో దేదివ్యమానంగా, సంబరాలతో నిమజ్జనం చేస్తాం.

\- బానోతు వీరన్న, ప్రైవేటు టీచర్

'పీవోపీ'కి చెబుదాం.. బై బై..




చిన్న వడ్డెపల్లి చెరువులో గణేష్‌ల నిమజ్జనం చేస్తున్న దృశ్యాలు (ఫైల్)

- చెరువుల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనంపై పీసీబీ నిషేధం
- ప్రత్యేక కొలనులను ఏర్పాటు చేసుకోవాలంటున్న పీసీబీ
- మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలంటున్న పర్యావరణ హితులు
- ఇప్పటి వరకు దృష్టి సారించని అధికారయంత్రాంగం

వరంగల్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27 నుంచి వినాయక నవరాత్రి వేడుకలు ప్రారంభమవుతున్నాయి.. ఈ నేపథ్యంలో గణపతి నిమజ్జనం కోసం తాత్కాలిక చెరువులు, కుంటలను ఏర్పాటు చేసుకుని అందులో నిమజ్జనం చేయాలని గత మంగళవారం రాష్ట్ర పర్యావరణ శాఖ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ జారీచేసిన ఆదేశాలు కనీసం సొంత జిల్లాలోనైనా అమలవుతాయా...? అని పర్యావరణ వేత్తలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణమండలి నవరించిన మార్గదర్శకాల ప్రకారం వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం తాత్కాలిక చెరువులు, కుంటలను ఏర్పాటు చేసుకొని అందులో నిమజ్జనం చేయాలని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) స్థానిక అధికారులను ఆదేశించింది. గణేష్ నవరాత్రి వేడుకల్లో పీవోపీ విగ్రహాలను కాకుండా బంక మట్టి విగ్రహాలను వినియోగించాలని పీసీబీ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఇదిలా ఉంటే అధికార యంత్రాగం మాత్రం ఇంకా దృష్టి సారించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మట్టి వినాయకులే...

మట్టితో చేసిన వినాయకులను ప్రతిష్ఠించాలని పర్యావరణ హితులు కోరుతున్నారు. పీవోపీ విగ్రహాలను చెరువులలో నిమజ్జనం చేయవద్దని, చెరువులలోని చేపలు, ఇతర జలచరాలు మృత్యువాత పడుతన్నాయని చెరువుల పరిరక్షణ కమిటీ నాయకులు, మత్స్యకార సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆ చెరువుల నీటిని వినియోగిస్తే క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన రోగాల బారిన పడుతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పదివేల విగ్రహాలు

గ్రేటర్ వరంగల్ పరిధిలోనే చిన్నవి, పెద్దవి కలిపి సుమారు పదివేల విగ్రహాల వరకు నిమజ్జనం చేస్తారు. అందులో సగానికి పైగా పీవోపీ విగ్రహాలే ఉంటాయి. ముఖ్యంగా చిన్న వడ్డెపల్లి చెరువు, ఉర్సు చెరువు, పద్మాక్షమ్మ గుండం, కట్టమల్లన్న చెరువు, హనుమకొండ, కాజీపేట తదితర ప్రాంతాల్లో ఉన్న చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేస్తారు. ఏటా వేలాది విగ్రహాలు నిమజ్జనం చేయడం వల్ల ఆ చెరువుల్లో నీటిని వినియోగించే ఆస్కారం లేకుండా పోతోంది. చెరువు చుట్టుపక్కల ఉన్న వారికి కూడా ఈ నీటి ఊటతో బోరు బావుల్లో చేరుతోంది. తద్వారా వారికి కూడా క్యాన్సర్ బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చేపలు చనిపోవడంతో మత్స్యకారులు ఉపాధిని కోల్పోతున్నారు. అందులోని చేపలను తిన్నా క్యాన్సర్ బారిన పడతారని పర్యావరణ వేత్తలు అంటున్నారు.

ఇంకా నెలరోజులే సమయం

వినాయక నవరాత్రుల వేడుకలకు నెలరోజుల సమయం మాత్రమే ఉంది. నవరాత్రులంటే యువతకు క్రేజ్. ఇప్పటికే సన్నాహాలు చేస్తున్నారు. పూజలందుకునే వినాయక విగ్రహం, మండపం, అలంకరణ, నిత్య పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపు, ప్రసాద వితరణ, నిధుల సేకరణ తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మత్స్యకారులు ఉపాధిని కోల్పోతున్నారు..



పీవోపీ విగ్రహాలు చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల కాలుష్య సాగరాల్లా మారుతున్నాయి. రసాయనాల వల్ల చెరువుల్లోని చేపలు చనిపోతున్నాయి. దీంతో మత్స్యకారుల ఉపాధి దెబ్బ తింటోంది. ప్రభుత్వం పీవోపీ విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యేకంగా కొలను తయారు చేసి అందులో నిమజ్జనం చేయాలి. తద్వారా ఎవరికీ నష్టం జరుగకుండా ఉంటుంది.

\- బయ్యు స్వామి, ముదిరాజ్ మహాసభ అర్బన్ అధ్యక్షుడు

క్యాన్సర్ లాంటి రోగాలను కొని తెచ్చుకోవడమే..




పీవోపీ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయకూడదు. దాంతో క్యాన్సర్ లాంటి రోగాల బారిన పడుతారు. ఇప్పటికైనా అధికార యంత్రాగం స్పందించి పీవోపీతో తయారుచేసిన విగ్రహాలను చెరువుల్లో కాకుండా ప్రత్యేకంగా తయారు చేసిన కొలనులో వేసేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే పర్యావరణాన్ని పరిరక్షించనట్లవుతుంది.

\- పెరుమాళ్ల లక్ష్మణ్, చెరువుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు

తూములకు తూట్లు.. కాల్వలకు గండ్లు..

- లక్నవరం ఆధునికీకరణ పనులకు మోక్షమెప్పుడు?!
- లీకేజీలతో వృథాగా పోతున్న జలాలు
- పేరుకుపోయిన పూడిక, పిచ్చిమొక్కలు
- ఏటా ఎండుతున్న చివరి ఆయకట్టు


లక్నవరం చెరువు


లక్నవరం చెరువు తూములకు మరమ్మతు చేస్తున్న కార్మికులు(ఫైల్)

గోవిందరావుపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తూట్లుపడ్డ కాల్వలు, ధ్వంసమైన తూములను శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చేసి రైతుల కష్టాలను తీర్చడంలో జాప్యం జరుగుతోంది. కాకతీయుల ఏలుబడిలో 800 ఏళ్లక్రితం సాగునీటి కష్టాలను తీర్చేందుకు గోవిందరావుపేట మండలం బుస్సాపురం సమీపంలో కొండల నడుమ లక్నవరం చెరువును 555 హెక్టార్ల విస్తీర్ణంలో నిర్మించారు. వరదనీటిని ఒడిసిపట్టేందు కోసం వ్యూహాత్మకం నిర్ణయం తీసుకున్నారు. స్థానికంగా వర్షాభావ పరిస్థితులు ఎదురైనప్పటికీ ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల వరద లక్నవరం సరస్సులోకి చేరేలా ఏర్పాట్లు చేశారు. సరస్సు నీటినిల్వ సామర్థ్యం 2.1 టీఎంసీలు కాగా, ఆయకట్టులో అధికారికంగా 8794ఎకరాలు, అనధకారికంగా మరో 3వేల ఎకరాల భూములు సాగవుతున్నాయి. చెరువు ఆయకట్టు మొత్తానికి నీటిని అందించేందుకు 80కిలోమీటర్ల మేర కాల్వలను తవ్వించారు.

రంగాపూర్, కోట, శ్రీరాంపతి, నర్సింహుల-1, నర్సింహుల-2 వంటి మొత్తం ఐదు కాల్వలున్నాయి. నీటి తటాకాల నిర్మాణంలో అప్పటి పాలకులు తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. ఇందుకు నిదర్శనంగా లక్నవరం అద్దం పడుతోంది. నైజాం కాలంలో చివరిసారిగా మరమ్మతు జరిగిన లక్నవరం తూములు క్రమేణా శిథిలమైపోయాయి. ఏటా వర్షాలు, వరదలకు కాల్వలు కూడా ఎక్కడికక్కడ తెగిపోయాయి. చెరువులో పూడిక తీయకపోవడంతో సుమారు లక్ష క్యూబిక్ మీటర్ల మేర పేరుకుపోయింది. కాల్వలు కూడా గడ్డి, పిచ్చి మొక్కలతో మూసుకుపోయాయి. ఇలా ప్రతీ పంటకాలంలో 150 క్యూబిక్ మీటర్ల నీరు వృథాగా పోతోంది. ఈ నీరు వెయ్యి ఎకరాలను సాగులోకి తెస్తుందని అంచనా. లీకేజీలతో ముందే నీరు అడుగంటి చివరి ఆయకట్టుకు అందక ప్రతిసారీ సుమారు వందల ఎకరాల వరిపంట ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు.

తాత్కాలిక మరమ్మతు

రాళ్లతో కట్టిన తూములను ప్రభుత్వం తాత్కాలికంగా మరమ్మతు చేయించింది. గత ఏడాది జూన్‌లో తూముల లోపల రాళ్లు కూలిపడ్డాయి. దీంతో నీళ్లు భారీగా లీకయ్యాయి. వెంటనే అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికారులు రూ.22 లక్షలతో తాత్కాలికంగా మరమ్మతు చేశారు. నైజాం కాలంలో అవలంబించిన పద్ధతులను పాటిస్తూ డంగు సున్నం, కరక్కాయ, బెల్లం మిశ్రమాన్ని ఉపయోగించి రిపేర్ పనులు పూర్తి చేశారు. ఇటు వ్యవసాయ పరంగా, అటు పర్యాటకంగా బహుళ ప్రయోజనకారిగా ఉన్న లక్నవరం చెరువును పరిరక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

అటకెక్కిన ప్రతిపాదనలు

ములుగు జిల్లా నీటిపారుదల శాఖ అధికారులు క్యాడ్‌వామ్(సీఏడీడబ్ల్యూఎం) పథకంలో భాగంగా 2017లో రూ20 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. అయినా ఎలాంటి స్పందన కనిపించలేదు. ఏళ్లు గడుస్తున్నా కొద్దీ కాల్వలు, తూములు ధ్వంసం కావడం, వ్యయం అంతకంతకూ పెరగడంతో రెండేళ్లక్రితం సమగ్ర సర్వే చేసిన అధికారులు రూ.30 0కోట్లతో మరోసారి ప్రతిపాదనలు పంపారు. తూములకు స్కిల్‌వాల్ నిర్మించడంతోపాటు పంట కాల్వల్లో 80కిలోమీటర్ల మేర గైడ్ వాల్, వరద కాల్వలకు మత్తళ్లు, డ్రెయినేజీ నిర్మించడం, కట్టల బలోపేతం చేయడం, దుంపెల్లిగూడెం నుంచి బుస్సాపురం మీదుగా రంగాపూర్ వరకు పంటకాల్వ పొడవునా రోడ్డు నిర్మాణం చేపట్టడాన్ని ఆ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. సరస్సు వద్ద నిత్యం పర్యవేక్షణ కోసం 20 మంది లష్కర్లతో పాటు మరో ఇద్దరు వాచ్‌మన్లను నియమించాలని కూడా ప్రతిపాదించారు. కానీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.

గోదావరి జలాలను మళ్లిస్తాం

లక్నవరం చెరువు సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. రామప్ప నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా గోదావరి జలాలను మళ్లించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాం. భూసేకరణ ప్రక్రియ పూర్తి కావచ్చింది. కాల్వలు, తూములను శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు చేసి రెండు పంటలకు సరిపడా నీటిని అందిస్తాం.

\- మంత్రి ధనసరి సీతక్క


లక్నవరం చెరువు నీటిని విడుదల చేస్తున్న మంత్రి సీతక్క (ఫైల్)

లక్నవరం అభివృద్ధికి ప్రణాళిక

లక్నవరం చెరువు అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం. నీటి వృథాను పూర్తిస్థాయిలో అరికడితే ఆయకట్టులోని మొత్తం పొలాలలో ఏడాదికి రెండు పంటలు పండుతాయి. గత సంవత్సరం తూముల లోపల మరమ్మతులు చేపట్టి కొంతమేరకు లీకేజీలకు అడ్డుకట్ట వేశాం.

\- శ్రీనివాస్, డీఈఈ

రేషన్ కార్డుల పంపిణీ

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపల్ 11వార్డు పరిధిలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ రవినాయక్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్హులైన వారికి రేషన్‌కార్డులు అందించి ఒక్కొక్కరికి నెలకు 6 కేజీల చొప్పున సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుందని చెప్పారు. మాజీ వార్డు కౌన్సిలర్ భూక్య లక్ష్మి, నజీర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ ఆఫీసు సందర్శన

ఇనుగుర్తి, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ కె.అనిల్‌కుమార్ సందర్శించారు. ఇటీవలె భూభారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను సమీక్షించారు. ఆయన వెంట తహసీల్దార్ తరంగిణి, ఎంఆర్ఐ ఎస్.కె. బషీర్, సిబ్బంది ఉన్నారు.

'అప్రమత్తంగా ఉండాలి'

బయ్యారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థల) లెనిన్ వత్సల్ టొప్పో వైద్య సిబ్బందిని ఆదేశించారు. బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ ఇన్‌పేషంట్ వార్డును పరిశీలించి,రోగులకు అందుతున్న సేవలను అడిగితెలుసుకున్నారు. మందులు,ల్యాబ్, కాన్పు గదులతో పాటు ఆస్పత్రి ఆవరణను పరిశీలించారు. రికార్డుల నిర్వాహణపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన జిల్లాలోనే బెస్ట్ పీహెచ్‌సీ అని కితాబు ఇచ్చారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో చంద్రమోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా నిలవాలి

తొర్రూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు అండగా నిలవాలని పెద్దనాన్న ఫౌండేషన్ చైర్మన్, తొర్రూరు మాజీ సర్పంచ్ దరావత్ రాజేశ్‌నాయక్ అన్నారు. బుధవారం తొర్రూరులోని అంబేద్కర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సరిత, సునీత, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

తొర్రూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : చెర్లపాలెంలో అభయాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాన కార్యక్రమాన్ని వైభవంగా వేదమంత్రోచ్చరణల మధ్య ప్రతిష్ఠించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో ఆడపడచులతో జలాభిషేకం, పూర్ణాహుతి, అష్టధాన్యవృష్టి, ప్రసాద వితరణతో మూడవ రోజు బుధవారం రోజున దేవతామూర్తుల శిలా విగ్రహాల ప్రతిష్ఠలు, శాంతికళ్యాణం, ఆశీర్వచనం వంటి కార్యక్రమాలు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి-రాజేందర్ రెడ్డి, రాజరామ్మోహన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి,నాగిరెడ్డి, యాకూబ్‌రెడ్డి, భారీ సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ముందస్తు అరెస్టు

డోర్నకల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులు, వారి సంఘాల నాయకులను బుధవారం డోర్నకల్ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు దాసరి మల్లేశం మాట్లాడుతూ.. చాలీచాలనీ వేతనంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్మికుల సమస్యల పరిష్కారం జరుపతలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఈ కార్యక్రమంలో మారబోయిన లక్ష్మి, రెడ్డబోయిన దివ్య, చక్కల సరోజ, సకినాల ఉపేంద్ర, దేవిక, ధనలక్ష్మి, మల్లమ్మలను సాయంత్రం సొంత పూచీకత్తుపై పోలీసులు విడుదల చేశారు.

'వైద్య సేవలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు'

గార్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వైద్యసేవల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా సీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్ హెచ్చరించారు. బుధవారం గార్లలో సీహెచ్‌సీ ఆసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక రోగుల వివరాలు, గర్భిణీల నమోదు వివరాల రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు పోయి వివరాలు సేకరించారు, ఆసుపత్రిలోని గ్యాస్ ప్లాంట్, శవ పంచనామా గదులను పరిశీలించారు. ఆసుపత్రి సూపరిండెండెంట్ డాక్టర్ శ్రీధర్ గౌడ్, డాక్టర్లు, హనుమంతరావు, రాజ్ కుమార్ జాదవ్ పాల్గొన్నారు.



కురవిలో జయశంకర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న టీఆర్ఎస్వీ నాయకులు



తొర్రూరులో జయశంకర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి



నలంద డిగ్రీ కళాశాలలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పిస్తున్న అధ్యాపకులు



మహబూబాబాద్‌లో జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

సార్‌కు ఘన నివాళి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని బుధవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ఇన్‌చార్జి కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా అధికారులు పురుషోత్తం, వెంకటేశ్వర్లు, నర్సింహాస్వామి, కిరణ్, వేముల సురేష్, డాక్టర్ కిరణ్‌కుమార్, మరియన్న, వీరన్న, వెంకటరమణ, జ్యోతి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

● మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ (కేవీఏ)ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్, వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజేశ్వర్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనే శ్వాసగా జీవించి, తెలంగాణ సిద్ధించేంత వరకు విశ్రమించని మేధావి జయశంకర్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, మైస నాగయ్య, పట్టాభి లక్ష్మయ్య, విష్ణువర్ధన్, మైస శ్రీనివాసులు, పెద్ది వెంకన్న, గోస్ శ్యాంరావు, కోట సుధాకర్, బి.శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారావు, మధుసూదన్‌రెడ్డి, మద్దెర్ల రాజన్న, బూర్ల ప్రభాకర్, డోలి జగదీష్, రామకృష్ణారావు, సంద వెంకన్న, మోహన్, పగడయ్య, సాగర్ పాల్గొన్నారు.

● భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జయశంకర్, గద్దర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ అధ్యక్షుడు కళ్లెం వీరారెడ్డి మాట్లాడుతూ మూడు తరాల పోరాట వారధి, తెలంగాణ రూపకల్పన ఆద్యుడు జయశంకర్ అని, తన కలం, గళం ద్వారా ప్రజలను చైతన్య పరిచిన విప్లవ గాయకుడు గద్దర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తండా సదానందం, కొమిరె ఉప్పలయ్య, సోమ గోవర్ధన్, మాలతో బావ్‌సింగ్, డొంకెని అశోక్ పాల్గొన్నారు.

● బస్టాండ్ సెంటర్‌లోని జయశంకర్ విగ్రహం వద్ద తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బలాష్టి రమేష్, రాచకొండ ఉపేందర్, చుంచు శ్రీశైలం, చీకటి ఉపేందర్, రాజు, అంజయ్య, వెంకటేశ్వర్లు, ఎస్. రామలింగారెడ్డి, విద్యాసాగర్, రమేష్, జిలకర శ్రీనివాస్, బి. మోహన్, సదయ్య పాల్గొన్నారు.

● నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాసులు, మసూద్ అహ్మద్, వి. సాంబశివరావు, బి. శ్రీనివాస్, రాజశేఖర్, బి. హతిరాం, యుగేంధర్, వీరు, కె. సుమలత, ఎం. సంతోష్‌కుమార్, రవితేజ, నరేష్, సూసెన పాల్గొన్నారు.

మహర్షి విద్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి కరస్పాండెంట్ సుధాఅర్జున్‌రెడ్డి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

● నలంద డిగ్రీ కళాశాలలో జయశంకర్ జయంతి, గద్దర్ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య, ప్రిన్సిపల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ శంకర్, కృష్ణారావు, అధ్యాపకులు ప్రసాద్, రేణుక పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

● తొర్రూరు పట్టణంలో జయశంకర్ విగ్రహానికి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కృష్ణప్రసాద్, విక్రమ్, శ్రీను, సోమ సత్తయ్యాచారి, తిరుపతిరెడ్డి, కాకిరాల హరిప్రసాద్, కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్యాంసుందర్ జయశంకర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

● దంతాలపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీవో విజయ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అప్సర్‌పాషా, గోపి పాల్గొన్నారు.

● డోర్నకల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, మండల పరిషత్‌లో ఎంపీడీవో శ్రీనివాసరావు, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ నిరంజన్, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జయశంకర్ చిత్రపటం వద్ద నివాళ్లర్పించారు.

● డోర్నకల్‌లో గద్దర్ జయంతిని పురస్కరించుకుని ఆయన అభిమానులు చిత్రపటంకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, సుశీల్‌కుమార్, సత్యనారాయణ, గోపి, రాజారాం, చంద్రమోహన్, లచ్చునాయక్ పాల్గొన్నారు.

● ఇనుగుర్తిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో పప్పుల వెంకన్న, దార్ల రాంమ్మూర్తి, పింగిలి శ్రీనివాస్, బొబ్బిలి మహేందర్‌రెడ్డి, బాబురావు, రజనీకాంత్, బేతమల్ల చంద్రయ్య, పాల్గొన్నారు.

● కేసముద్రం డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు లెంకల సంతోష్‌రెడ్డి, మైసయ్య, రాజు, యాదగిరి, ప్రవీణ్, ముస్మీ, రమేష్, రమాదేవి, మంజుల, రవిలు జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

● కురవిలో జయశంకర్ జయంతిని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ ఉద్యమనాయకుడు గుగులోతు రవినాయక్, కిన్నెర మల్లయ్య, బండి దీపక్, పేర్ల గణేష్, చిన్నం భాస్కర్, బుడిగే మధు, భూక్య శ్రీనివాస్, శ్రీశైలం, కృపాకర్, హత్తిరాం, రాంబాబు, సంతోష్, ఉపేందర్, విజయ్, సత్యం పాల్గొన్నారు.

● బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాల, బయ్యారం బాలుర ఉన్నత పాఠశాల నందు నిర్వహించారు. వేరువేరుగా జరిగిన కార్యక్రమాల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు రాజమణి, సంతోష్, నరేంద్రరాజు, కుమారస్వామి, సరిత, సదాశివుడు, భాస్కర్, బాబూలాల్, మనోజ్ కుమార్, సుస్మిత పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న చంద్రశేఖర్



విద్యార్థులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రముఖ వైద్యుడు చంద్రశేఖర్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యుడు కల్వకూరి చంద్రశేఖర్ ఐదుగురు నిరుపేద విద్యార్థుల స్కూల్ ఫీజుకు రూ.లక్ష సాయం అందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన చంద్రశేఖర్ బుధవారం తన జన్మదినోత్సవం రోజున పేదలకు సాయం చేయాలని సంకల్పంతో ఐదుగురు నిరుపేదల విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. స్థానిక వండర్ కిడ్స్ విద్యార్థులు ఎస్కే. అశ్రర్, ముజమిల్, జోయా, వర్సటైల్ విద్యార్థినీ కె.గీతిక, శ్రీచైతన్య విద్యార్థి జి.సాయిరాం స్కూల్ ఫీజు చెల్లించేందుకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున వెరసి ఐదుగురు విద్యార్థులకు రూ.లక్ష సాయం అందించారు.

ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న, కొండపల్లి కేశవరావు, రావుల రవిచందర్‌రెడ్డి, డాక్టర్ వి.జగన్మోహన్‌రావు, పర్కాల రవీందర్‌రెడ్డి, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, మాలె కాశీనాథ్, సాదుల సురేష్‌బాబు, పమ్మి సనాతనచారి, ఆల్‌టెక్ రమేష్, పి.లక్ష్మీనారాయణ, అనుమాల సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

తొర్రూరు: ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ముత్యాలమ్మకు మొక్కుల వేడుకలను బుధవారం తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయాల వద్దకు చేరుకొని అమ్మవారికి బోనం సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసంలో నిర్వహించుకునే బోనాల వేడుకలను ప్రజలు అత్యంత వైభవంగా కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి నిర్వహించుకున్నారు. పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి పట్టణ కేంద్రంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొని సందడి చేశారు. ఆలయ నిర్మాణ దాత డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మజి కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఊరూరా గ్రామదేవతకు వైభవంగా బోనాలు

తొర్రూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మాపురం, పత్తేపురం, మాటేడు, వెల్లికట్టె తదితర గ్రామాల్లో గ్రామదేవత ముత్యాలమ్మతల్లికి అంగరంగా వైభవంగా భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని పురవీధుల గుండా బోనాలతో ఆటపాటలు, శివసత్తులతో మహిళలు ఉత్సాహంగా తల్లికి బోనాలతో బైలెలి జంతుబలి ఇచ్చి మొక్కలు చెల్లించుకున్నారు. పాడిపంట, పిల్లాపాప సంతోషంగా ఉండాలని తల్లిని వేడుకున్నారు.

హలాల్ వద్దంటూ వీహెచ్‌పీ ప్రచారం

కేసముద్రం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో ఈనెల 6, 10 తేదీల్లో నిర్వహించే బోనాల పండుగలో భక్తులు యాటలను అమ్మవారికి సమర్పించే క్రమంలో ఇతర మతాలకు చెందిన హలాల్ విధానం వద్దని విశ్వహిందూ పరిషత్, హిందు ధర్మపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ మేరకు కేసముద్రం స్టేషన్, విలేజి ముత్యాలమ్మ ఆలయాల వద్ద బుధవారం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు కంచు సురేందర్ మాట్లాడుతూ హలాల్ చేసి అమ్మవారికి యాటలను సమర్పించడం మహాపాపమని, సాంప్రదాయం ప్రకారం జట్కా, ముర్ధాల్ పద్ధతి పాటించాలని కోరారు. పడిదాల కరుణాకర్‌రావు, ముత్యాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు జాటోత్ హరీష్‌నాయక్, బోగోజు నాగేశ్వరాచారి, వేణుగోపాలాచారి, ఉప్పు నూతల రమేష్, గుగులోత్ భద్రు పాల్గొన్నారు.

వనితలకు.. వడ్డీ వాపస్

(5వ పేజీ తరువాయి)

కొత్తగూడ, గంగారం మండలాల్లో 1847 సంఘాలకు రూ.1.13కోట్లు,పాలకుర్తి నియోజకవర్గంలో తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో 4188 సంఘాలకు రూ.4.74కోట్ల వడ్డీని ప్రభుత్వం తిరిగి మహిళలకు చెల్లించింది. జిల్లాలో అత్యధికంగా కేసముద్రం మండలంలో 3,783 సంఘాలకు రూ.4.63కోట్ల వడ్డీని చెల్లించడం విశేషం.

వడ్డీలేని రుణం అంటే..?

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకుంటారు. ఈ రుణాలను సమాన నెలవారీ వాయిదా(ఈఎంఐ)లతో తమ రుణాలను తిరిగి వడ్డీతో సహా చెల్లిస్తారు. ఇలా చెల్లించిన వడ్డీ డబ్బులను ప్రభుత్వం తిరిగి మహిళలకు చెల్లిస్తుంది. దీంతో ఆ రుణం 'వడ్డీ లేని రుణం'గా పరిగణించబడుతుంది. అయితే గత పదేళ్లుగా ఇవి పేరుకే 'వడ్డీ లేని రుణాలు'గా మిగిలి పోయాయి. మహిళలకు వడ్డీ ఇచ్చిన దాఖలాలు లేకపోవడంతో ఈ పథకం కిందనే రుణం తీసుకొని వడ్డీలు చెల్లిస్తూ తిరిగి వస్తాయనే ఆశను వదులుకొని మళ్లీ కొత్త రుణాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళాశక్తి పథకంలో భాగంగా స్వయం సహాయ సంఘాల సభ్యులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండేందుకు వడ్డీడబ్బులు తిరిగి ఇవ్వడంతో మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

చారిత్రక ఆలయాలను అభివృద్ధి చేయాలి

(5వ పేజీ తరువాయి)

కూడా నిధులు ఇవ్వాలని కోరారు. మొత్తం రూ.185కోట్లతో ఆలయాల పునరుద్ధరణ పనులు చేపడితే వరంగల్ నగరం ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని అన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాచీన ఆలయాలను ప్రసాద్ పథకంలో చేర్చుతానని హామీ ఇచ్చారు. ఇందుకు ఎంపీతో పాటు ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్యతో పాటు ఎమ్మెల్యేలు శ్రీహరి, రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, ఎమ్మెల్సీ సారయ్య బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. అలాగే రైల్వేస్టేషన్ ఆవరణలో నూతన బస్‌స్టేషన్ కోసం స్థలం కేటాయించాలని, అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి చేయాలని కోరారు. కాజీపేట బస్‌స్టేషన్ ఏర్పాటు ఆవశ్యత గురించి వివరించారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించారని, ప్రజా రవాణా దృష్ట్యా బస్‌స్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు.

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ

డోర్నకల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ప్రజల్లో బీజేపీకి మంచి ఆదరణ లభిస్తోందని, ప్రత్యామ్నాయశక్తిగా బీజేపీ ఎదుగుతుందని ఆ పార్టీ జిల్లా నాయకులు గుగులోతు శంకర్‌నాయక్ అన్నారు. డోర్నకల్ మండలం ముల్కలపల్లిలో బుధవారం మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో బుధవారం ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితువులవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ పట్టణాధ్యక్షుడు దేవాసింగ్‌నాయక్, జిల్లా నాయకులు నంజాల అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాయల రాంబాబు, నాయకులు కృష్ణారావు, ఉడుగుల శ్రీను, వెంకన్న, దుర్గాప్రసాద్, భార్గవ్ పాల్గొన్నారు.



ముల్కలపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

విద్యుదాఘాతంతో మేక మృతి

• వృద్ధురాలికి సైతం కరెంట్ షాక్

• తృటిలో తప్పిన ప్రమాదం

కొత్తగూడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో మేక మృతి చెందగా, వృద్ధురాలికి సైతం కరెంట్ షాక్ కొట్టింది. అప్రమత్తతో తృటిలో ప్రమాదం తప్పిన సంఘటన మండలంలోని పొగుళ్లపల్లిలో బుధవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన గట్టి భద్రక్క మేకలు మేపుకుంటూ అటువైపుగా వచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనుంచి వెళుతున్న మేక విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. మేకను కాపాడే క్రమంలో భద్రక్కకూ సైతం కరెంట్ షాక్ బారిన పడింది. అదే సమయంలో అటుగా వెళుతున్న ఓ వ్యక్తి చూసి ఆమెను కాపాడారు.

ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

పొగుళ్లపల్లి బ్రిడ్జి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. వంతెనపై రోడ్డువేసే క్రమంలో పోసిన మట్టిపోవడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డు కంటే కిందికి అయి రోడ్డుకు సమాంతరంగా ఉంది. దీంతో వాహనదారులు, ప్రజలు అటువైపుగా వెళ్లితే విద్యుత్ షాక్‌తో ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. కాగా, కాంట్రాక్టర్ డబ్బులు చెల్లిస్తే ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తామని విద్యుత్ శాఖ అధికారులు అంటుంటే, మాకేం సంబంధం విద్యుత్ శాఖ అధికారులే ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని కాంట్రాక్టర్ అంటున్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరపాలి

గంగారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఆగస్టు 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకురాలు పుల్లక్క కోరారు. ఈ సందర్భంగా గంగారం మండలం మర్రిగూడెంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రపంచ ఆదివాసీల రక్షణ కోసం జెనీవాలో 1982 ఆగస్టు 9న 1070 దేశాల ప్రతినిధుతో ఐక్యరాజ్య సమితి ఆదివాసీ దినోత్సవంగా తీర్మానించారన్నారు. ఛత్తీష్‌గడ్ రాష్ట్రంలో ఆదివాసీల పక్షాన ప్రశ్నించే గొంతుగా నిలబడిన మావోయిస్టులను ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రప్రభుత్వం భూటపు ఎన్‌కౌంటర్లతో అమాయకుల ప్రాణాలు తీస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ భూముల్లో విలువైన ఖనిజాలను కొల్లగొట్టేందుకు చేస్తున్న ఆపరేషన్ కాగార్‌ను తక్షణమే ఆపేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాబి, మేడ ఎల్లయ్య, సువర్ణపాక శ్రీను, వెంకన్న, వినేష్ పాల్గొన్నారు.

అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్యాయం చేసే నల్ల చట్టాలు రద్దు చేయాలని, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్‌తో చేపట్టిన పోరాటాల సమయంలో ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని వామపక్ష పార్టీల నేతలు బి.విజయసారథి, సాదుల శ్రీనివాస్, గౌని ఐలయ్య, మండల వెంకన్న డిమాండ్ చేశారు. నల్లా చట్టాలు రద్దు, ఆర్టీసీ ఉద్యమ సమయ కేసులో మహబూబాబాద్ కోర్టుకు బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ చర్యలను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు చేపట్టడంతో కేంద్రం దిగివచ్చి నల్ల చట్టాలను రద్దు చేశారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపి వామపక్ష పార్టీల నేతలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. జిల్లా కోర్టుకు హాజరైన వారిలో అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, గునిగంటి రాజన్న, అల్వాల వీరన్న, హలావత్ లింగ్యానాయక్, జగ్గన్న, పెరుగుకుమార్ పాల్గొన్నారు.

సీపీఎస్ సిస్టంను రద్దు చేయాలి

మరిపెడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, ఉద్యోగుల చిరుకాల డిమాండైన సీపీఎస్ సిస్టంను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్టీయూ బాధ్యులు బుధవారం మరిపెడలోని మోడల్ స్కూల్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చాగర్లముడి శ్రీధర్ మాట్లాడుతూ సీపీఎస్ సిస్టంను రద్దు చేయాలని సెప్టెంబరు 1న 10వేల మంది ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ దగ్గర ఆందోళన చేపడుతున్నామన్నారు. అనంతరం మరిపెడ మోడల్ స్కూల్, సీతారాంపూర్ స్కూల్‌లోని టీచర్లకు పీఆర్టీయూ సభ్యత్వాలను ఇచ్చి ఆ ప్రక్రియ నమోదును ప్రారంభించారు. ఈ సంఘ మరిపెడ మండల బాధ్యులు కీసర రమేశ్‌రెడ్డి, లింగాల మహేశ్‌గౌడ్, అర్జున్ నాయక్, రాంమోహన్, అబ్బూరి సునీల్, శ్రీను, లెనిన్, శ్రీధర్, భరత్, కేదారి, రవి, జహీరుద్దీన్, వెంకటేశ్వర్‌రావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన కేంద్రబృందం

నెల్లికుదురు(తొర్రూరు రూరల్), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లికుదురు మండలంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పనులను బుధవారం జాతీయస్థాయి కేంద్రబృందం సభ్యులు సందర్శించారు. మండలంలోని బోటిమీది తండాలో ఉపాధి హామీ, సబ్‌సెంటర్లు, పాఠశాలలు గత నాలుగు సంవత్సరాల కిందట చేసిన వివిధ రకాల పనులు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 10రకాల పనులు పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. బుకేశ్వర్‌సింగ్, అశ్విన్, మండల ప్రత్యేకాధికారి మరియన్న, ఎంపీడీవో సింగారపు కుమార్, ఎంపీవో పద్మ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి గాయాలు

కురవి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కురవి మండలం బంచరాయితండా వద్ద ద్విచక్రవాహనం పాఠశాలకు వెళ్లే బాలికను ఢీకొట్టింది. ఈ ఘటనలో మూడ్ పావని అనే విద్యార్థినికి ఎడమకాలు విరిగింది. తండావాసులు పావనిని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పీడీఎస్‌యూ జిల్లా నాయకులు బానోత్ దేవేందర్ మాట్లాడుతూ పాఠశాలకు సమీపంలో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.